

నిర్మలా సీతారామన్ | రోష్నీ నాడార్ మల్హోత్రా | సోమా మోండల్ | కిరణ్ మజుందార్ షా

ఫోర్బ్స్ జాబితాలో నిర్మల

శక్తిమంతమైన మహిళల్లో నలుగురు భారతీయులు

రోష్నీ, సోమా మోండల్, కిరణ్ మజుందార్ షాకు చోటు

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన 100 మంది మహిళల జాబితాలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఐదోసారి చోటు దక్కించుకున్నారు. ప్రముఖ వ్యాపార పత్రిక 'ఫోర్బ్స్' తాజాగా విడుదల చేసిన 2023 జాబితాలో నలుగురు భారతీయులకు చోటు లభించింది. వీరిలో భారత్ నుంచి నిర్మలా సీతారామన్ అగ్రస్థానాన్ని (32వ స్థానం) కైవసం చేసుకోగా.. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సంస్థ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా (60వ స్థానం), స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చైర్‌పర్సన్ సోమా మోండల్ (70వ స్థానం), బయోకాన్ లిమిటెడ్ కంపెనీ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా (76వ ర్యాంకు) తర్వాతి స్థానాల్లో నిలిచారు. రోష్నీ నాడార్ అత్యంత సంపన్నురాలైన మహిళగా, మహాదాతగా గుర్తింపు పొందారు. సెయిల్ తొలి మహిళా చైర్మన్‌గా మోండల్ చరిత్ర సృష్టించారు. సంపన్న వ్యాపారవేత్తల్లో కిరణ్ మజుందార్ షా ఒకరు.

టైమ్ 'పర్సన్ ఆఫ్ ద ఇయర్'గా

టేలర్ స్విఫ్ట్

న్యూయార్క్, డిసెంబర్ 6: అమెరికాకు చెందిన ప్రముఖ నటి, గాయని, రచయిత్రి టేలర్ స్విఫ్ట్ 2023 ఏడాదికి టైమ్ మ్యాగ్‌జైన్ 'పర్సన్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపికయ్యారు. ప్రపంచంలోని ప్రముఖులు పోటీపడినప్పటికీ చివరకు ఆమె విజేతగా నిలిచారు. ఫైనల్‌కు ఎన్నికైన బార్బీ, కింగ్ ఛార్లెస్-3, ఓపెన్ ఏఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సామ్ ఆల్ట్‌మన్ తదితర తొమ్మిది మంది నుంచి టేలర్ స్విఫ్ట్‌ను విజేతగా ఎంపిక చేసినట్టు టైమ్ ప్రకటించింది. 'ఆమెపై ఆదరణ దశాబ్దాల నుంచి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నది' అంటూ ఆమె ఎన్నిక సందర్భంగా టైమ్ వ్యాఖ్యానించింది. స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో అత్యధికంగా ప్రాతినిధ్యం వహించిన కళాకారిణి అని స్పాటిఫై ప్రకటించిన వారం తర్వాత బుధవారం టైమ్ మ్యాగ్‌జైన్ టేలర్ స్విఫ్ట్‌ను పర్సన్ ఆఫ్ ద ఇయర్‌గా ప్రకటించడం విశేషం.

దేశంలోనే తొలి మహిళా

ఏడీసీగా మనీశా

ఐజ్వాల్, డిసెంబర్ 6: దేశంలోనే తొలి మహిళా ఏడీసీ(ఎయిడ్ డీ క్యాంప్)గా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన అధికారిణి మనీశా పాధీ నియమితులయ్యారు. 2015 బ్యాచ్‌కు చెందిన మనీషాను మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు ఇటీవల తనకు ఏడీసీగా నియమిస్తూ నిర్ణయం తీసుకొన్నారు. వెంటనే ఉద్యోగంలో చేరిన ఆమె గత నెల 29న గవర్నర్‌కు రిపోర్టు చేశారు. ఐజ్వాల్‌లోని రాజ్‌భవన్‌లో ఉన్న అధికారులు, సిబ్బందికి తనను పరిచయం చేసుకొన్నారు. ఐడీసీగా నియమించక ముందు.. మనీశా బీదర్, పుణే, బఠిండా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్లలో పనిచేశారు. భారత్‌లో ఎయిర్ డీ క్యాంప్‌ను గౌరవ బిరుదుగా పేర్కొంటారు. రాష్ట్రపతికి ఐదుగురు ఏడీసీలు ఉంటారు. అదే విధంగా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌లకు ముగ్గురు చొప్పున ఏడీసీలు ఉంటారు.

పీవోకే మనదే

మొదటిపేజీ తరువాయి...

మరోసారి స్పష్టం చేశారు. ఈ మేరకు రీఆర్గనైజేషన్(సవరణ) బిల్లు ప్రకారం జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో ప్రతిపాదనల ప్రకారం పెంచిన 90 సీట్లలో 24 సీట్లను పీవోకేకు రిజర్వ్ చేస్తున్నట్టు వెల్లడించారు. అదేవిధంగా రెండు స్థానాలను కశ్మీరీ వలస కమ్యూనిటీకి, ఒక స్థానాన్ని పీవోకే నుంచి స్థిరపడిన వారికి రిజర్వ్ చేసినట్టు అమిత్‌షా తెలిపారు. తొలిసారిగా ఎస్సీ/ఎస్టీ కమ్యూనిటీలకు 9 స్థానాలు కేటాయించినట్టు పేర్కొన్నారు.

నెహ్రూ చేసిన పెద్ద తప్పిదాలు అవి..

బిల్లులకు చర్చకు సమాధానం సందర్భంగా అమిత్‌షా మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వంపై విమర్శల దాడి చేశారు. నెహ్రూ సరైన చర్యలు, నిర్ణయాలు తీసుకొని ఉంటే పెద్ద భూభాగాన్ని వదులుకొనే వాళ్లం కాదని, నేడు పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)గా ఉన్న ప్రాంతం భారత్‌లో భాగమయ్యేదని అన్నారు. నెహ్రూ హయాంలో జరిగిన తప్పుల(నెహ్రూవియన్ బ్లండర్స్) వల్ల నేడు కశ్మీర్ ఏండ్లుగా కష్టాలు పడాల్సి వస్తున్నదని అన్నారు. 'మన ఆర్మీ విజయవంతంగా పంజాబ్ ప్రాంతానికి చేరుకొన్న వెంటనే కాల్పుల విరమణను ప్రకటించారు. దీని వలనే పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) పుట్టుకొచ్చింది. మూడు రోజుల తర్వాత గనుక ఈ కాల్పుల విరమణను ప్రకటించి ఉంటే.. పీవోకే భారత్‌లో భాగంగా ఉండేది' అని అమిత్‌షా దుయ్యబట్టారు.

బుధవారం లోక్‌సభలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి అమిత్ షా

ఆ బ్లండర్ గురించి మాట్లాడితే రాజీనామా చేస్తారేమో

నెహ్రూపై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ వ్యాఖ్యలను నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేసిన సభ్యులు.. కొంత సేపటి తర్వాత మళ్లీ సభకు తిరిగి వచ్చారు. కాంగ్రెస్ ఎంపీల వాకౌట్ అనంతరం బీజేపీ ఎంపీ భర్తృహరి మహ్తాబ్ మాట్లాడుతూ 1962లో చైనాతో యుద్ధానికి దారితీసిన 'హిమాలయన్ తప్పిదాల' గురించి కూడా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాట్లాడాలన్నారు. దీనికి షా స్పందిస్తూ 'నేను నెహ్రూ చేసిన రెండు తప్పిదాల గురించి మాట్లాడితే కాంగ్రెస్ ఎంపీలు కలవరపడి సభ నుంచి వాకౌట్ చేశారు. అదే హిమాయలన్ బ్లండర్స్ గురించి కూడా మాట్లాడితే రాజీనామా చేస్తారేమో!' అంటూ చమత్కరించారు. కశ్మీర్ సమస్యను అంత అత్యవసరంగా ఐక్యరాజ్యసమితి వద్దకు తీసుకెళ్లకుండా ఉండాల్సిందని అన్నారు.

కశ్మీర్‌లో 47.. జమ్ములో 43

లోక్‌సభ ఆమోదించిన జమ్ముకశ్మీర్ రీఆర్గనైజేషన్(సవరణ) బిల్లు, జమ్ముకశ్మీర్ రిజర్వేషన్(సవరణ) బిల్లులో పలు కీలక అంశాలు ఉన్నాయి. గతంలో జమ్ముకశ్మీర్‌లో శాసనసభ నియోజకవర్గాల సంఖ్య 83 ఉండగా.. తాజా రీఆర్గనైజేషన్ బిల్లులో దాన్ని 90కి పెంచాలని ప్రతిపాదించారు. ఇంతకుముందు కశ్మీర్ డివిజన్‌లో 46, జమ్ము డివిజన్‌లో 37 స్థానాలు ఉండేవి. ఇప్పుడు వాటిని వరుసగా 47, 43కు పెంచారు. రిజర్వేషన్ సవరణ బిల్లు ప్రకారం ఉద్యోగ నియామకాలు, విద్యా ప్రవేశాల్లో అర్హులైన పలు వర్గాలకు రిజర్వేషన్లలో మార్పులు చేయనున్నారు. కాగా, పీవోకే నుంచి వలస వచ్చిన వారికి జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో కేవలం ఒక సీటు మాత్రమే రిజర్వ్ చేయడంపై ఎన్‌వోఎస్ చైర్‌పర్సన్ రాజీవ్ చుని అసంతృప్తి వ్యక్తం చేశారు. తాము 17 లక్షలు ఉన్నామని, అయితే 3 లక్షలు ఉన్న కశ్మీరీ వలస కమ్యూనిటీకి రెండు సీట్లు ఇచ్చారని అన్నారు.

వివాదాస్పద వ్యాఖ్యలపై డీఎంకే ఎంపీ క్షమాపణలు

మరోవైపు హిందీ రాష్ట్రాలను ఉద్దేశించి డీఎంకే ఎంపీ సెంథిల్ కుమార్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై బుధవారం కూడా లోక్‌సభలో రగడ కొనసాగింది. తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తున్నానని ఎంపీ సెంథిల్ సభలో ప్రకటించడంతో వివాదం కాస్త సద్దుమణిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇటీవల బీజేపీ గెలిచిన మూడు రాష్ట్రాలను ఉద్దేశించి మంగళవారం లోక్‌సభలో మాట్లాడుతూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హిందీ మాట్లాడే ప్రాంతాలన్నీ 'గోమూత్ర రాష్ట్రాలు' అని, బీజేపీ అక్కడ మాత్రమే విజయం సాధిస్తుందని వ్యాఖ్యానించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఆ పార్టీ గెలవలేదని అన్నారు.

సిమ్‌కార్డులకు డిజిటల్ వెరిఫికేషన్

పేపర్ ఆధారిత కేవైసీ వెరిఫికేషన్‌కు స్వస్తి

జనవరి 1 నుంచి అమలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: సెల్‌ఫోన్ వినియోగదారులు ఇకపై పేపర్ ఫారాలను నింపాల్సిన అవసరం లేకుండా సిమ్‌కార్డు పొందొచ్చు. ఈ మేరకు పేపర్ ఆధారిత కేవైసీ విధానానికి స్వస్తి పలుకుతూ టెలికం విభాగం తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం వచ్చే ఏడాది జనవరి 1 నుంచి టెలికం కంపెనీలు డిజిటల్ విధానంలో వెరిఫికేషన్ పూర్తిచేసి సిమ్‌కార్డులను జారీచేయనున్నాయి. సిమ్‌కార్డుల జారీకి పేపర్ ఆధారిత కేవైసీ విధానాన్ని 2012 నుంచి అవలంబిస్తున్నారు. తాజాగా తీసుకొన్న ఈ-కేవైసీ విధానం వల్ల సిమ్ కార్డుల మోసాలకు అడ్డుకట్ట పడుతుందని, కస్టమర్లను చేర్చుకోవడంలో టెలికం కంపెనీల ఖర్చు కూడా తగ్గుతుందని భావిస్తున్నారు.

100కుపైగా వెబ్‌సైట్లపై కేంద్రం కొరడా

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: ఆర్థిక నేరాలకు కారణమయ్యే వ్యవస్థీకృత అక్రమ పెట్టుబడులు, పార్ట్‌టైం జాబ్ మోసాలకు పాల్పడుతున్న 100కుపైగా వెబ్‌సైట్లపై కేంద్రం కొరడా ఝుళిపించింది. విదేశీ వ్యక్తులు నిర్వహిస్తున్న ఈ వెబ్‌సైట్లు ప్రధానంగా పార్ట్‌టైం ఉద్యోగం కోసం వెతుకుతున్న రిటైర్డ్ ఉద్యోగులు, మహిళలు, నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకొన్నాయి. కేంద్ర హోంశాఖకు చెందిన ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) ఈ వెబ్‌సైట్ల మోసాలను గుర్తించి వాటిని బ్లాక్ చేయాల్సిందిగా నివేదించింది. స్పందించిన ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ సమాచార సాంకేతిక చట్టం-2000 కింద ఈ వెబ్‌సైట్లను బ్లాక్ చేసింది.

రామమందిర ప్రారంభోత్సవానికి సచిన్, కోహ్లికి ఆహ్వానం

అయోధ్య: వచ్చే ఏడాది జనవరి 22న అయోధ్య రామ మందిరంలో జరుగనున్న రాముని ప్రాణ ప్రతిష్ఠ, ప్రారంభోత్సవ కార్యక్రమానికి రామాలయ ట్రస్టు 7 వేల మందికి ఆహ్వానాలు పంపింది. వీరిలో సచిన్ టెండూల్కర్, కోహ్లీ, అమితాబ్ బచ్చన్, ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీ తదితర ప్రముఖులు ఉన్నట్టు ట్రస్ట్ నిర్వాహకులు బుధవారం తెలిపారు. సాధువులు, ఆధ్యాత్మికవేత్తలు కూడా ఉన్నారని చెప్పారు.

13లోపు పార్లమెంట్‌పై దాడి చేస్తాం

ఖలిస్థాన్ ఉగ్రవాది పన్నూ హెచ్చరిక

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: ఈ నెల 13లోపు పార్లమెంట్‌పై దాడి చేస్తామని ఖలిస్థాన్ ఉగ్రవాది గుర్‌పత్వంత్ సింగ్ పన్నూ హెచ్చరించాడు. ఈ మేరకు ఓ వీడియోను విడుదల చేశాడు. 'నన్ను చంపడానికి భారత్‌కు చెందిన ఏజెన్సీలు ప్రయత్నించాయి. కానీ ఈ ప్రయత్నం విఫలమైంది. నన్ను చంపాలన్న కుట్రకు పగతీర్చుకుంటాను. ఈ నెల 13లోపు ఎప్పుడైనా పార్లమెంట్‌పై దాడి చేస్తాం' అని ఆ వీడియోలో పన్నూ హెచ్చరించాడు. అలాగే 2001లో పార్లమెంట్‌పై దాడి చేసిన అఫ్జల్‌గురు ఫొటోతోపాటు ఖలిస్థాన్‌గా మారనున్న ఢిల్లీ అని ఆ వీడియోలో ఉన్నది. ఖలిస్థాన్ హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

యునెస్కో జాబితాలో గార్బా నృత్యం

అహ్మదాబాద్: గుజరాత్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన గార్బా నృత్యం యునెస్కో సాంస్కృతిక వారసత్వ సంపద జాబితాలో చోటు దక్కించుకుంది. మంగళవారం బోట్స్‌వానాలోని కసానేలో ప్రారంభమైన 18వ యునెస్కో ఇంటర్ గవర్నమెంటల్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ బుధవారం తెలిపారు. గుజరాతీల సంస్కృతిలో ఒక భాగంగా మారిన గార్బా నృత్యం.. యునెస్కో జాబితాలో చేరటంతో ఆ రాష్ట్ర ప్రజల్లో హర్షం వ్యక్తమైంది.

జమ్ముకశ్మీర్ బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు

- ఎస్సీ వర్గీకరణపై గతంలోనే తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపాం
- వడ్డెరలను ఎస్టీలుగా గుర్తించాలి
- లోక్‌సభలో ఎంపీ నామా డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): జమ్ముకశ్మీర్ రిజర్వేషన్(సవరణ) బిల్లు, జమ్ముకశ్మీర్ రీఆర్గనైజేషన్(సవరణ) బిల్లులకు బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. బిల్లులపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో నామా పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీలకు సంబంధించి దేశంలో జనగణనను సత్వరం చేపట్టాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం 2014 నవంబర్ 29న అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇది కేంద్ర ప్రభుత్వం వద్దనే పెండింగ్‌లో ఉన్నదని నామా పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్ బిల్లులను ఆమోదించడం సమర్థనీయమే అని పేర్కొన్న ఆయన.. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణకు సంబంధించి అనేక అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. తెలంగాణలో అసెంబ్లీ స్థానాలను 119 నుంచి 153 కు పెంచాల్సి ఉండగా, ఇంతవరకు అది జరుగలేదని, ఈ అంశాన్ని త్వరితగతిన తేల్చాలని కోరారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

తెలంగాణాలో బీసీలుగా ఉన్న వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని నామా కేంద్రాన్ని డిమాండ్ చేశారు. వడ్డెరలు కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీలుగా కొనసాగుతున్న అంశాన్ని నామా గుర్తుచేశారు. వారి సామాజిక, ఆర్థిక అంశాలు, పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు.

ఓబీసీ రిజర్వేషన్లు పెంచే ప్రతిపాదన లేదు

కేంద్రసహాయ మంత్రి కపిల్ మహేశ్వర్ పాటిల్

న్యూఢిల్లీ: స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా నిష్పత్తి ప్రకారం ఓబీసీల రిజర్వేషన్లను పెంచే ప్రతిపాదనేదీ తమ వద్ద లేదని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో స్పష్టం చేసింది. బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్ కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర పంచాయతీ రాజ్ సహాయ మంత్రి కపిల్ మహేశ్వర్ పాటిల్ సమాధానమిచ్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243డీ ప్రకారం ఓబీసీలకు మూడో వంతు రిజర్వేషన్లు అమలవుతున్నాయన్నారు. ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించే హక్కు రాష్ట్రాలకు ఉన్నందున 21 రాష్ట్రాలు దీనిని 50 శాతానికి పెంచాయని ఆయన తెలిపారు.

ఏఎంకి, పీఎంకి తేడా తెల్వదు!

రాహుల్ ఆఫీసుపై ప్రణబ్ వ్యాఖ్యలు తన పుస్తకంలో ప్రస్తావించిన శర్మిష్ఠ

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: 'రాహుల్ గాంధీ ఆఫీసుకు ఏ.ఎం, పీ.ఎంకి మధ్య తేడా తెల్వదు, వారు రేపొద్దున ప్రధాని కార్యాలయాన్ని ఎలా నడుపుతారు?' అంటూ మాజీ రాష్ట్రపతి, కాంగ్రెస్ సీనియర్ నేత ప్రణబ్ ముఖర్జీ వ్యాఖ్యానించారట. ఒకానొకరోజు రాహుల్‌గాంధీ సాయంత్రం తనను కలవాల్సి ఉండగా, ఆయన కార్యాలయ సిబ్బంది మాత్రం ఆయనకు ఉదయం కలవాలని సమాచారమిచ్చారని పేర్కొంటూ ఆయన పై వ్యాఖ్యలు చేశారు. గాంధీ-నెహ్రూ కుటుంబాల వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన రాహుల్‌గాంధీకి రాజకీయ చతురత మాత్రం వారసత్వంగా అబ్బలేదని ప్రణబ్ అభిప్రాయపడ్డారట. ఈ విషయాల్ని ఆయన కొన్నేండ్ల కిందట తన డైరీలో రాసుకున్నారట. తన తండ్రి జీవితంపై రాసిన పుస్తకంలో ఈ అంశాల్ని ప్రణబ్ కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ ప్రస్తావించారు. 'ఇన్ ప్రణబ్, మై ఫాదర్ : ఏ డాటర్ రిమెంబర్స్' పేరుతో శర్మిష్ఠ ఈ పుస్తకాన్ని రచించారు. ప్రణబ్ డైరీతో పాటు ఆయన రాజకీయ జీవితంపై అధ్యయనం చేసి ఆమె ఈ పుస్తకాన్ని రాశారు. ఇందులో గాంధీ కుటుంబం, రాహుల్‌గాంధీ రాజకీయ భవిష్యత్తు.. మొదలైన అంశాలను వివరించారు. రాహుల్‌గాంధీ గురించి ప్రణబ్ తన డైరీలో రాసుకున్న అభిప్రాయాలను శర్మిష్ఠ తన పుస్తకంలో ప్రస్తావించారు. 2020లో కన్నుమూసిన ప్రణబ్ ముఖర్జీ, తన రాజకీయ జీవితంలో గాంధీ కుటుంబంలో మూడు తరాలకు చెందినవారితో కలిసి పనిచేశారు.

పూర్తిగా వరదతో నిండిపోయిన చెన్నై

వరద గుప్పిట్లోనే చెన్నై

చెరువులను తలపిస్తున్న పలు ప్రాంతాలు

సహాయక శిబిరాల్లోనే వందలాది మంది

చెన్నై, డిసెంబర్ 6: మిగ్‌జాం తుఫాన్ తమిళనాడు రాజధాని చెన్నైలో బీభత్సం సృష్టించింది. తుఫాన్ ప్రభావంతో గత 2-3 రోజులుగా కురిసిన భారీ వర్షాలు బుధవారానికి తగ్గినప్పటికీ, నగరం ఇంకా వరద ముంపులోనే ఉన్నది. భారీగా పోటెత్తిన వరద నీటితో చెన్నైలోని పలు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు ఇంకా వరద పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. కరెంట్ వైర్లు కొన్ని చోట్ల ఇంకా నీటిలోనే ఉండటంతో ముందస్తు జాగ్రత్తగా కొన్ని ఏరియాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేశామని ప్రభుత్వం పేర్కొన్నది. కిల్పౌక్, కట్టుపక్కం తదితర ప్రాంతాల్లో విద్యుత్తు ఇంకా పునరుద్ధరణ కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరద నీరు తగ్గిన చోట రహదారులను శుభ్రం చేస్తున్నామని, ప్రజలకు తాగునీటి సరఫరా కూడా చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ శివదాస్ మీనా చెప్పారు. ఎన్డీఆర్ఎఫ్‌తో పాటు రాష్ట్ర బృందాలు సహాయక చర్యల్లో ఉన్నాయని, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఆహారం, పాల ప్యాకెట్లు అందజేస్తున్నామని వెల్లడించారు.

వరద నీటిలోనే నడుచుకొంటూ..

మరోవైపు మునక ప్రాంతాల నుంచి ప్రజలను రెస్క్యూ సిబ్బంది సహాయ శిబిరాలకు తరలించారు. వందలాది మంది ఇంకా శిబిరాల్లోనే తలదాచుకొంటున్నారు. నగర పరిధిలోని పలు చోట్ల ప్రజలు తమ పిల్లలను తీసుకొని నీటిలో నడుచుకుంటూ సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. కార్లు, ఇతర వాహనాలు నీటిలోనే మునిగి ఉన్నాయి. వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. చెన్నైలోని కొలత్తూరుకు చెందిన రాజారాం అనే వ్యాపారి మాట్లాడుతూ తమ దుకాణాల్లోకి నీరు చొచ్చుకొచ్చిందని, గత రెండు రోజులుగా కరెంట్ లేదని తెలిపారు. చైనా నుంచి దిగుమతి చేసుకొన్న వెయ్యికి పైగా చేపలు చనిపోయాయని, రూ.3-5 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.

నూతన పార్లమెంటుకు అంబేద్కర్ పేరు పెట్టాలి

ముంబై బీఆర్ఎస్ శాఖ సంతకాల సేకరణ

ముంబై, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): నూతన పార్లమెంట్ భవనానికి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరు పెట్టాలని ముంబై బీఆర్ఎస్ శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ శ్రేణులు సంతకాల సేకరణ చేపట్టాయి. కొత్త పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలని బీఆర్ఎస్ ప్రభుత్వం శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపిన విషయం తెలిసిందే. సంతకాల సేకరణ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముంబై నాయకులు హేమంత్ కుమార్, థాణే జిల్లా కోఆర్డినేటర్ మక్సుద్ ఖాన్, లోక్‌సభ కోఆర్డినేటర్ రవీంద్ర, ముంబై సిటీ కో కోఆర్డినేటర్ దేవానంద్, చందివలి విధాన సభ కోఆర్డినేటర్ రమేశ్ వల్, లక్ష్మణ్, సత్యనారాయణ పద్మశాలి, నర్సింగ్ ఒట్కర్, బద్ది గోపాల్, ముకేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీబీసీ చైర్మన్‌గా సమీర్ షా

ఎంపిక చేసిన బ్రిటన్ ప్రభుత్వం

లండన్, డిసెంబర్ 6: ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ బీబీసీకి కొత్త చైర్మన్‌గా బ్రిటన్ ప్రభుత్వం బుధవారం భారత మూలాలున్న సమీర్ షాను ఎంపిక చేసింది. ఈ మేరకు ప్రధాని రిషి సునాక్ నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నది. ఈ ఏడాది ఏప్రిల్‌లో బీబీసీ హెడ్‌గా తప్పుకొన్న రిచర్డ్ షార్ప్ స్థానాన్ని సమీర్ షా భర్తీ చేయనున్నారు. సమీర్ షా నియామకాన్ని పార్లమెంట్ కమిటీ ఆమోదించింది. సమీర్ 40 ఏండ్లుగా టీవీ ఇండస్ట్రీలో పనిచేస్తున్నారు. బీబీసీలో కరెంట్ ఎఫైర్స్ హెడ్‌తో పాటు పలు బాధ్యతలు నిర్వర్తించారు.

ఇంజినీరింగ్ సీట్లపై

పరిమితి ఎత్తివేత

- వచ్చే ఏడాది నుంచే అమలు
- ఏఐసీటీఈ పరిధిలోకి బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ కోర్సులు
- పాలిటెక్నిక్ కాలేజీలకూ అటానమీ హోదా: ఏఐసీటీఈ

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: మెరుగైన ప్రదర్శన కనబర్చిన ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్లపై పరిమితిని ఎత్తివేస్తున్నట్టు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ప్రకటించింది. నాణ్యతా ప్రమాణాల్ని పెంచే ఉద్దేశంతో బీబీఏ, బీసీఏ కోర్సుల్ని ఏఐసీటీఈ పరిధిలోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ఏఐసీటీఈ చైర్మన్ టీజీ సీతారామ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-27కు సంబంధించి అప్రూవల్ ప్రాసెస్ హ్యాండ్‌బుక్ (ఏపీహెచ్)ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మెరుగైన ప్రదర్శన కనబర్చిన ఇంజినీరింగ్ కాలేజీలకు ఏఐసీటీఈ 3 ఏండ్లకోసారి సీట్ల పరిమితిపై అనుమతులు ఇస్తుంది. కౌన్సిల్ నిబంధనలు వర్తిస్తాయి. నిపుణుల కమిటీ సందర్శించి ఆమోదం తెలపాలి. మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్ యూజీ కోర్సులను క్రమబద్ధీకరిస్తూ ఏఐసీటీఈ పరిధిలోకి తీసుకొస్తున్నాం' అని అన్నారు. బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ కోర్సులను ఆఫర్ చేస్తున్న కాలేజీలు ఇక నుంచి ఏఐసీటీఈ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. యూజీ కోర్సుల విద్య, పాలనాపరమైన విధానాల్లో మార్పులు చేయలేదన్నారు.

పాలిటెక్నిక్ కాలేజీలకూ..

'సాంకేతిక, మేనేజ్‌మెంట్ విద్యలో సమన్వయంతో కూడిన అభివృద్ధిని ప్రతిపాదిస్తూ బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ కోర్సులను కౌన్సిల్ పరిధిలోకి తీసుకొస్తున్నాం' అని ఏఐసీటీఈ మెంబర్ సెక్రటరీ రాజీవ్‌కుమార్ చెప్పారు. నూతన ఏపీహెచ్ ప్రకారం, పాలిటెక్నిక్ కాలేజీలు అటానమీ హోదా కోసం దరఖాస్తు చేయాలి. దీంతో సొంత పాఠ్యప్రణాళికతో కొత్త కోర్సులను తీసుకురావొచ్చు. సీట్ల సంఖ్య పెంపునకు ఏఐసీటీఈ అనుమతులు అవసరం.

- జైపూర్‌లో కర్ణిసేన మద్దతుదారుల ఆందోళన

రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణిసేన చీఫ్ సుఖ్‌దేవ్ సింగ్ దారుణ హత్య నేపథ్యంలో రాజస్థాన్ అంతటా ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. సుఖ్‌దేవ్ సింగ్ అనుచరులు, కర్ణిసేన, ఇతర సంస్థలు బుధవారం రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా జైపూర్ సహా వివిధ చోట్ల రోడ్లను దిగ్బంధించారు.

మూడు రాష్ట్రాలకు సీఎంలుగా కొత్తవాళ్లే!

- యోచిస్తున్న బీజేపీ అభిష్టానం
- అమిత్ షా, నడ్డాతో ప్రధాని భేటీ



న్యూఢిల్లీ, డిసెంబర్ 6: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. అధికారం చేపట్టబోయే పార్టీలేవో తేలిపోయాయి. ఇప్పుడు అందరి దృష్టి కాబోయే ముఖ్యమంత్రులెవరన్న అంశంపైనే. ముఖ్యంగా బీజేపీ గెలిచిన రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో సీఎంల ఎంపిక కత్తిమీద సాములా తయారైంది. ఈ రాష్ట్రాల్లో బీజేపీ కొత్త ముఖాలనే సీఎం అభ్య